
# గుమ్మంలో సరోజ



ఎదురుగా సైకిల్ బెల్ రెండు మూడు సార్లు విని ఉలిక్కిపడింది సరోజ.

" అరే–మీరా–రండి "

మధ్యాహ్నం వేళ ఇంటికి వచ్చిన భర్తని చూసి ఆశ్చర్య పడింది.

" ఏం లేదూ–ఇవాళ బంద్ కదూ. కాస్త కాఫీ తాగి పోదామని — ఏమిటలా ఎండలోనే గుమ్మంలో నించున్నావ్?" సైకిల్ దిగుతూ అన్నాడు రామ్మూర్తి.

" అబ్బే–ఏంలేదు – ఊరికే–ఏం తోచకా " లోపలికి వస్తూ అంది.

రామ్మూర్తి సైకిల్‌కు స్టాండ్ వేసి లోపలికి వచ్చాడు.

" కాసిని మంచినీళ్ళు ఇవ్వు ముందు."

సరోజ గబ గబా లోపలికి వెళ్ళి చల్లని మంచినీళ్ళు తీసుకు వచ్చింది.

రామ్మూర్తి కాళ్ళూ చేతులూ ముఖం కడుక్కుని తువ్వాలుతో తుడుచుకుంటున్నాడు. మంచి నీళ్ళు గ్లాసు పట్టుకునించుంది సరోజ. ఆమె కళ్ళుమాత్రం వీధి గుమ్మం వైపే వున్నాయ్.

తుడుచుకోవడం పూర్తయి, మంచినీళ్ళు తీసుకున్నాడు రామ్మూర్తి.

" ఏవన్నా టిఫిన్ చెయ్యగలవా? తొందరగా. అరగంటలో వెళ్ళాలి మరి–" అన్నాడు.

" ఓ–అలాగే ఉప్మా చెయ్యనా?"

" అబ్బా – ఎప్పుడూ ఉప్మానే? బజ్జీలేనా పకోడీలేనా చెయ్యరాదూ!"

" హూఁ – అవి తరిగి, పిండి కలిపి, వేసే టప్పటికి బోర్ బాబూ!" మళ్ళీ గుమ్మం వైపు చూసింది సరోజ.

" అరగంట టైముంది కదా! ఆ మాత్రం

చెయ్యలేవూ? పోన్లే నీ యిష్టం. కానీయ్, ఏదో ఒకటి తొరగా" అన్నాడు.

"సరే–పకోడీలే చేస్తాలెండి"

సరోజ ఇన్ని ఉల్లిపాయలు తీసుకుని, వంగితే గుమ్మంకనిపించేలా కూర్చుని తరగడం మొదలెట్టింది. ఉల్లిపాయ ఘాటుకి కళ్ళు మండినప్పుడల్లా, కళ్ళు తుడుచుకుంటూ, ముందుకి వంగి చూస్తోంది. రామ్మూర్తి ఆ వారం వచ్చిన పత్రిక తిరగేస్తూ మధ్య మధ్యలో సరోజని గమనిస్తున్నాడు.

ఎందుకలా గుమ్మంలోకి అస్తమానూ చూస్తోంది? తను వచ్చేటప్పటికి ఎండలో పడి గుమ్మంలో ఎందుకు నుంచుంది? ఊరికే ఏంతోచక నించుందేమోలే-సరిపెట్టేసు కుందామన్నా అతని మనస్సు కలతగానే వుంది. ఎవరైనా ఫ్రెండ్స్ వస్తానన్నారేమో – ఊహూ–ఈ ఊళ్ళో తనకు తెలిసిన వారు లేరే–అతనికి ఇంటికి వచ్చేటప్పటికి వున్న ఆనందం ఇప్పుడు లేకుండా పోయింది.

"ఇవిగో పకోడీలు–పత్రిక అడ్డం పెట్టుకు నిద్రపోతున్నారా?"

సరోజ పకోడీల ప్లేటు ముక్కుదగ్గరగా తీసుకొచ్చింది.

"అబ్బా చాలా బావున్నాయ్"

"ఇంకా తినకుండానే"

"వాటి వాసనబట్టి ఆ మాత్రం చెప్పలేనూ"

"మీరు ఇవితింటూ వుండండి. నేను టీ పెడతా"

"సరోజా ఆ వీధి తలుపు కాస్త దగ్గరసా వేద్దూ–మరీ వీధిలో కూర్చుని తింటున్నట్లుంటుంది" అన్నాడు.

ఛటుక్కున వెనక్కి తిరిగింది సరోజ.

"అహహఁ తలుపు వెయ్యొద్దు. మీరే ఇటు ఇలా జరిగి కూర్చోండి"

రామ్మూర్తిని జరగమని, అంతకుముందుకంటే ఎక్కువ బార్లా తలుపు తీసి వచ్చింది.

రామ్మూర్తికి వళ్ళు మండిపోయింది, ఏమీ అనలేక కోపం అంతా పకోడీల మీద చూపించాడు. అవి అయిదు నిమిషాలలో అయిపోయాయి!

"ఇంకా వెయ్యనా?" అంది సరోజ.

"చాలు, కాస్త టీ ఇస్తే నేనింక వెడతా" అన్నాడు.

గరిమెళ్ళ సత్యవాణి

హఠాత్తుగా సీరియస్ ఐపోయిన రామ్మూర్తిని చూసి బిక్కమొహం వేసింది సరోజ. మాట్లాడకుండా గబగబా టీ కలిపి కప్పులో పోసి ఇచ్చేసింది.

రామ్మూర్తికి ఏమిటోలావుంది మనసు. ఎందుకలా గుమ్మంలో నించుంది సరోజ? ఎందుకలా గుమ్మం వైపు చూస్తోంది? ఇవే ప్రశ్నలు చెదపురుగు దొల్చినట్లుగా దొలుస్తున్నాయ్ అతని బుర్రని.

"నే వెడుతున్నా–తలుపేసుకో-" అన్నాడు.

"సాయంకాలం పెందరాళే వస్తారుగా" మామూలుగా అడిగింది సరోజ.

అంటే-తను సాయంకాలం ఎన్నింటికొస్తాడో కూడా వివరం కావాలన్న మాట–హు!

"వస్తాన్లే" అనేసి, సైకిల్ బర్ మని లాగి స్పీడ్‌గా బయల్దేరాడు. పది గజాల తర్వాత వెనక్కి తిరిగాడు. సరోజ గుమ్మంలోనే నిలబడి వుంది. ఓ వంద గజాల తరువాత వెనక్కి తిరిగి చూసాడు. ఇంకా సరోజ అక్కడే నిలబడి వుంది. అతనికి సందు టర్నింగ్ వచ్చింది. సందు తిరగబోతూ మళ్ళీ తల త్రిప్పి చూశాడు.

సరోజ అటువైపు తిరిగి, గుమ్మాని కానుకుని నించుంది. అంటే-తాను వచ్చేటప్పటికి సరిగ్గా అలాగే కదూ నించుందీ. అంటే అటు వైపు నుంచీ ఎవరొస్తారూ?

రామ్మూర్తికి వళ్ళంతా కారం రాసుకున్నట్లుంది.

సాయంకాలం వద్దనుకుంటూనే పెందరాళే వెళ్ళాడు. సరోజ మామూలుగానే వుంది. ఇద్దరూ కూరల మార్కెట్టుకి వెళ్ళారు. సరదాగానే గడిచింది. రామ్మూర్తి మనస్సులో మధ్యాహ్నం తాలూకు చిటపటలు నెమ్మదిగా తగ్గాయి.

మర్నాడు ఆఫీసులో పన్నెండు అవుతుండగానే మనసు దొలచడం ప్రారంభించింది రామ్మూర్తికి.

సరోజ ఏంచేస్తూ వుంటుంది? లోపల నిద్రపోతూ వుంటుందా?—

మళ్ళా లంచ్‌టైంలో సైకిలెక్కి యింటికి బయల్దేరాడు. అల్లంత దూరంలో ఇల్లు ఉండగానే అతని కను బొమ్మలు ముడి బడ్డాయ్. సరోజ గుమ్మాని కానుకుని నించుని అటువైపే చూస్తోంది!

ఈసారి సైకిల్ బెల్ మ్రోగించలేదు. మాట్లాడకుండా సైకిల్ స్టాండ్ వేసి సరోజని రాసుకుంటూ లోపలికి వెళ్ళిపోయాడు.

"అబ్బా–మీరా–హడిలి చచ్చాను బాబూ"– అంది సరోజ.

"ఏఁ– నేననుకోలేదా – ఇంకెవరైనా వచ్చే వారున్నారా? నేనొస్తే–పాపం హడిలి చావడం దేనికీ?"

గబగబా డ్రాయర్ సొరుగు లాగుతూ అవీ ఇవీ వెతుకుతూ, నెమ్మదిగా గొణిగాడు. రామ్మూర్తి మాటలు సరోజకి పూర్తిగా విన్పించలేదు. ఏదో మొత్తం మీద కోపంలో ఉన్నాడని గ్రహించింది.

"టిఫిన్ చెయ్యమంటారా" అనునయంగా అడిగింది.

"అఖ్ఖర్లేదు. కాస్త కాఫి ఏడు" ఏదో ఫైలు కోసం వెతుకుతున్నట్లు నటిస్తూ అన్నాడు. ఇందాకా మాటలు కొంచెం గట్టిగా అంటే ఎంత బావుండునూ, అని తన మీద తనకే కోపం వచ్చింది.

అయిదు నిముషాల్లో సరోజ ఇచ్చిన కాఫి కషాయంలా త్రాగేసి బయట పడ్డాడు. అతనికి పరమ చిరాకేసింది. సరోజని నాలుగు ఈడ్చి తన్నక, అసలు విషయం కనుక్కోక, ఇలా తనలో తను కుమిలిపోవడం ఏమిటీ?–అని అతని మగతనం సవాల్ చేసింది. ఇంక లాభం లేదు. ఇంకోసారి ఇలా జరిగితే భరించలేడు తను—

ఆ మర్నాడు ఆఫీసుకు వెడుతుంటే సరోజ "ఇవ్వాళ కూడా వస్తారా మధ్యాహ్నం?" అనడిగింది.

"ఏం రాకూడదా?"

"అబ్బే–అదేమిటీ?–రాకూడదని కాదు. మీరు వస్తానంటే ముందే టిఫిన్ చేసి వుంచుతాను, అందుకని" అంది.

"చాల్లే అస్తమానూ ఇంటి చుట్టూ తిరగడమేనా పని? ఇవాళ చాలా వర్కు వుంది. మధ్యాహ్నం రాను."

ఎంతో కోపంగా అందామనుకున్నా చివరి మాటలు మామూలుగా చెప్పేశాడు. అలా మామూలుగా అన్నాడని తర్వాత ఆఫీసుకెళ్ళి బాధ పడిపోయాడు. ఛీ – ఛీ – ఇంకొంచెం

డైరీ ఫారాలనుంచి వచ్చే పాలబుడ్డీలు వాడే వారు – తీరిక సమయాల్లో చెయ్యదగ్గ చిత్రాలు వున్నాయి. అవి ఎలా చెయ్యాలంటే–

పాలసీసాల మూతలను బాగా పోగుచేసి, ఒక బ్లూ కాగితం మీద కావలసిన డ్రాయింగ్ వేసుకుని, ఈ మూతలను కావలసిన విధంగా కత్తిరించి, జిగురుతో డ్రాయింగ్ పైన అతికిస్తూ రావాలి. తర్వాత, ఆ కాగితాన్ని అట్టమీద అతికించి 'ఫ్రేమ్' చేయించాలి! అంతే! దాన్ని ముందు గదిలో గోడకు వేలాడదీస్తే వెండి రేకులతో చేసినట్టుగా వుండి ఆకర్షణీయంగా కనిపిస్తుంది.

ఈ ఛాయాచిత్రాలు చూస్తే ఆ చిత్రాలు ఎలా ఉంటాయో తెలుసుకోవచ్చును.

—సి. హెచ్. ఇందిరాదేవి





కోపంగా అంటే బావుండునని వాపోయాడు.

ఆఫీసులో పదకొండు గంటలనుంచీ అస్తమానూ చేతి వాచీ, గోడనున్న పెద్ద గడియారం చూడ్డంతోటే సరిపోయింది రామ్మూర్తికి. ఒకరిద్దరు కలీగ్స్ రామ్మూర్తికేసి అదోలా చూసి నవ్వారు. మధ్యాహ్నం ఇంటికెళ్ళడం అలవాటైందని హాస్యాలు చెయ్యడం-నెమ్మదిగా వాళ్ళలో వాళ్ళు జోకులు వేసుకోవడం మొదలు పెట్టారు. పన్నెండున్నర అవుతుంటే అందరూ ముసి ముసి నవ్వులు నవ్వుతున్నా లెక్క చెయ్యకుండా ఇంటికి బయల్దేరాడు రామ్మూర్తి.

ఈసారి అటో యిటో తేలిపోవాలి - అనుకుంటూ రాకెట్లా దూసుకుపోయాడు. ఇల్లు వచ్చేసింది. సరోజ గుమ్మాని కానుకుని నించునుంది! రామ్మూర్తి కోపం తారాజువ్వలా లేచింది. లోపలికి వస్తూనే సరోజ జబ్బ పట్టుకుని లోపలికి లాగి తలుపులు దభాల్న వేసేశాడు.

సరోజ ఈ హఠాత్సంఘటనకి బిత్తరపోయింది.

"ఏమిటీ? ఏమైంది?" అంది కంగారుగా.

"అదే నేనూ అడుగుతున్నా. ఏమైంది నీకు? ఎవరి కోసం రోజూ గుమ్మంలో పడి ఎదురు చూస్తున్నావ్. పాపం వాళ్ళు వచ్చారా లేదా? పైగా నిన్నంతా దిగులు మొహం వేశావు - చెప్పు. ఎవరు ఈ మిట్ట మధ్యాహ్నం వచ్చి నిను కలిసే ఆ వెధవ? చెప్పు." రామ్మూర్తి కోపంతో ఊగిపోతున్నాడు.

"ఉండండి–ఉండండి"–అని సరోజ ఒక్క క్షణం అతని కళ్ళల్లోకి చూసి ఫకాల్న నవ్వేసింది. తెరలు తెరలుగా నవ్వొస్తుంటే నవ్వలేక రామ్మూర్తిని పట్టుకుని పకపకా నవ్వేస్తోంది. రామ్మూర్తికి సరోజ ఎందుకు నవ్వుతోందో అర్థం కాలేదు. కానీ ఆ క్షణంలోనే తాను పొరపాటుగా అనుమాన పడ్డాడేమోనన్న ఆలోచన వచ్చేసింది.

"ఎందుకలా నవ్వుతావ్? నేనడిగిందానికి సమాధానం చెప్పు" ఇంకా బింకంగా ఉండాలని ప్రయత్నిస్తూ అన్నాడు. కానీ అతని మాటల్లో ఎక్కడా కోపచ్ఛాయలు లేవు.

"ఎందుకు నవ్వుతున్నానా? తమరు పప్పులో కాలేశారని." మళ్ళీ నవ్వింది. నవ్వీ నవ్వీ కళ్ళలో నీళ్ళు తిరుగుతుంటే అంది: "దాన్ని ఏమంటారో తెలుసా — వైటింగ్ ఫర్ ది పి. యమ్ అంటారు" అంది.

"ఏమిటీ–సరిగ్గా చెప్పు?" అన్నాడు.

"అది అంతే-వైటింగ్ ఫర్ ది పి.ఎమ్-అంటే పోస్ట్‌మాన్–అని" గలగలా నవ్వింది సరోజ.

రామ్మూర్తికి కూడా సన్నగా నవ్వొచ్చింది.

"రెండుమూడు రోజులుగా మానాన్నగారి దగ్గరనుండి ఉత్తరం కోసం చూస్తున్నా–రాలేదు. నిన్నంతా ఏదోలా వుంది. ఆదీగాక రెండు కథలు పత్రికకి పంపాను. రోజూ పోస్ట్‌మాన్ వచ్చే టైంకి ఎదురు చూడకుండా వుండలేక పోతున్నా– అంతే–అయినా మీకంత అనుమానం అయితే ఎలా" సూటిగా అడిగింది సరోజ.

"ఛ–ఛ–అనుమానం కాదు" అనుకోకుండా తాను సంజాయిషీ చెప్పుకో వలసి వచ్చేటప్పటికి కంగారు పడి పోయాడు రామ్మూర్తి.

"అనుమానం ఏం లేదు. కానీ ఎందుకు రోజూ అలా నించుని ఎదురుచూస్తున్నావో తెలీక- అన్నానంతే– సారీ! సరోజా! నేనూ ఆఫీసులో మధ్యాహ్నం పోస్ట్‌కోసం తెగ ఎదురుచూస్తా" ఏమిటేమిటో చెప్పుకు పోతున్న రామ్మూర్తిని మధ్యలో ఆపేసి "పోన్లెండి ఇప్పటికైనా చెప్పారు. లోపలికి రండి–టిఫిన్ తిందురు గాని" అంది.

వాతావరణం తేలికవడంతో ఇద్దరూ హాయిగా నవ్వుకున్నారు. *